# గుండె గోదారయ్యింది

-ఉరిటి సులేఖ



గుండె కాన్వాసుపై ఎప్పటికీ తడారని చిత్రం తను! గోదారి చెక్కిళ్ళపై మెరిసే వెన్నెల కాంతి తను!

తనతో పరిచయం ఓ గమ్మత్తు! సావాసం ఓ తమాషా! అనురాగం ఓ మధుర వేదన! కలయిక కడలి సంగమం! వేర్పాటు గోదారి వరద!

తనతో నా పరిచయం ఎలా అయింది అన్నది అప్రస్తుతం. తను నా ప్రాణం అన్నది సత్యం!

'నీకు ప్రేమించడం చాతకాదా? వ్యక్తీకరించడం చాతకాదా?' ఓ వెన్నెల రాత్రి ఆమె సందేహం.

'రెండోదే' నా వేళ్ళ మధ్య ఆమె నల్లని శిరోజాలు. వేలికొసల్లో గోదారి పొంగు! నా సమాధానం మౌనం పట్టీ మీద మువ్వల గుసగుసలా!

వెనక హారన్ అదే పనిగా మోగుతోంది. ఉలిక్కిపడి ఆలోచనల నుండి బయటపడ్డాను. కారుని కుడివైపు బాట మీదుగా పోనిచ్చాను.

గోదారి తరంగాల్లా ఆలోచనలు ఒకదాని వెంట మరొకటి. నిజానికి ఈ రోజు నా మనసేం బాగోలేదు. తనకేమైంది! అసలు ఎందుకిలా ఫోన్ చేసింది? పుష్కరంలో కలుసుకోమందెందుకని? అదీ పన్నెండేళ్ల తర్వాత!

తాము ఆఖరిసారిగా కలుసుకున్నది పన్నెండేళ్ళ క్రితమైనా, ప్రతీ సంఘటనా, ప్రతీ సంభాషణా సరిగ్గా ఇప్పుడే జరిగినట్టు, అప్పుడే విచ్చుకున్న బొండుమల్లె పరిమళమంత తాజాగా, స్వచ్ఛంగా ఉందెందుకని?

'ఛోటీ బాతే, ఛోటీ ఛోటీ బాతే కీ హై యాదే బడీ, భూలే నహీ' ముఖేష్ గొంతు వాక్‌మేన్, ఇయర్ ఫోన్స్ నుండి మధురంగా విన్పిస్తోంది.

వింటానికి మాటలు మామూలుగా అనిపించినా, మహా అద్భుతాన్ని సంతరించుకుంటాయి. చందన పరిమళంలా మనసుని వీడిపోవు! బహుశా అవి తన మాటలవ్వడం వల్లనేమో?!

ఆకుపచ్చ పైట కప్పుకున్నట్టు గోదారికి ఓ పక్కంతా పచ్చటి పొలాలు.

'నీకో కథ చెప్పనా?'

'ఆ' నా గొంతులో పరధ్యానం. చూపులు మాత్రం తన కంటి చురుకుదనాన్ని, అమాయకపు వదనాన్ని, అధరాల అరుణిమల్ని ఆస్వాదించడంలో క్షణం తీరిక లేకుండా!

'ఏయ్, చెప్పినపుడే సరిగ్గా విను. మళ్ళీ అర్థం కాలేదని చివరాఖరికి అడిగావంటే మళ్ళీ మళ్ళీ చెప్పను'

'సరే, ఇప్పుడు చెప్పు' సర్దుకు కూర్చున్నాను.

'సుబ్బారావు, సుబ్బలక్ష్మీ గాఢంగా ప్రేమించుకున్నారంట'

'ఊ తర్వాత?' మధ్యలో నేను ప్రశ్నలు వేయకపోతే వినడం లేదేమోనని తనకి అనుమానం!

'అయితే రెండు కుటుంబాలు పెళ్ళికి ఒప్పుకోలేదంట'

'పాపం'

'ఆమెని విడిచి ఉండలేనని నిశ్చయించుకున్న సుబ్బారావు, చనిపోవడాన్కి నిర్ణయించుకుని, ఆవేశంగా సుబ్బలక్ష్మితో చెప్పి చనిపోయాడంట'

'ఆ!'

ఆశ్చర్యంగా తెరుచుకున్న నా నోరు మూస్తూ 'అరవై ఏళ్ల తర్వాత!' అంటూ నెమ్మదిగా కథ ముగించింది.

నేను పకాల్న నవ్వాను. నిజం చెప్పొద్దూ. నేను జీవితంలో అంత హాయిగా నవ్వింది కేవలం తన సమక్షంలోనే! ఆఫ్‌కోర్స్ ఏడ్చింది కూడా తన కోసమే!

'అయ్యగారు, అటు వెళ్ళొద్దండీ, రోడ్డు మూసేశారు. ఈ పక్క నుండి, అదే ఆ బియ్యపు బత్తాలున్నాయి చూడండి అటి పక్క నుండి ఎళితే రాంపాదాల రేవు దగ్గరికి చేరుతారండి'

'రోడ్డు క్లోజ్ అయిందా?' నిట్టూరుస్తూ వెనక్కి తిరిగాను. దూరంగా కాటన్ ఆనకట్ట. నా ఆలోచన్లకి కూడా!

'అయ్, మరేనండీ, రద్దీ ఎక్కువైంది కదండీ, పెదకార్లు, చినకార్లు అన్నీ ఇటే మళ్ళించేసారండీ. ఇటైతే గమ్మున అందుకోవచ్చుండీ'

సైకిల్ అబ్బాయి చెప్పాడు. సైకిల్‌కి ఇరువైపులా రెండు బుట్టల నిండా దోర జామకాయలు.

వాటిని చూస్తోంటే కర్పూరపు భరిణ తెరిచినట్టు జ్ఞాపకాల వాసనలు. తనకి అవంటే ఇష్టం. అవే కాదు, తేగలు, వాటిని అంటిపెట్టుకున్న గట్టి కొబ్బరి, పడవ పాట, పనస కూర, సరంగు చేపల పులుసు! చివరాఖరికి నేను!

'అయ్యగారు, తవరేదో ఆలోచిస్తున్నట్టున్నారండి. ఆయ్, చిల్లర ఇదిగోనండీ. తవరేం అనుకోనంటే ఒక మాటండి. మరేనండీ చినకారు నడుపుతున్నపుడు కొంచం జాగర్త ఉండాలండి' చిన్నగా నవ్వి, ఆకుల దొన్నెలో ఉన్న జాంకాయల్ని లోపల పెట్టి కారు స్టార్ట్ చేశాను.

'ఏయ్, ఎక్కడికి వెళిపోయావ్? నిన్న రాలేదు. కనీసం ఫోన్ చెయ్యలేను. ఎంత ఎదురు చూశానో తెలుసా?'

'కొంచెం పనుంటే స్నేహితుడితో బయటికి వెళ్ళాను'

'నేను నమ్మను'

'నిజం?'

'అవును. నిజం'

'సరే, నమ్మానుగానీ, మళ్ళీ ఎప్పుడు పునర్దర్శనం?'

'నువ్వు ఎప్పుడంటే అప్పుడు'

'నిజం?'

'నిజం'

'సరే, బై'

'బై'

అట్లాంటి సంఘటనలు ఎన్నో!

నాతోపాటు నా ఆలోచనలు పరిగెడుతున్నాయి. కాలం కూడా పరుగెత్తింది. తర్వాత మేం కలవలేదు. కారణం పరిస్థితులంటాను నేను. పలాయనవాదం అంటుంది తను. ఏదేమైనా భౌతికంగా మేం దూరమయినా మానసికంగా మరింత దగ్గర అయ్యాం. నా దిండు ప్రతి రాత్రి దుఃఖాన్ని పంచుకునేది. తన విరహం భరింపశక్యం కాలేదు. పర్యవసానంగా తన ఫోన్ రింగయ్యింది చాలా కాలం తర్వాత.'

'ఏం చేస్తున్నావ్?'

'నిద్రపోతున్నా'

'అబద్ధం'

'అవును, నువ్వెంత అబద్ధమో, నేనూ అంతే అబద్ధం'

'కోపమా?'

'కాదు, నీ మీద కోమంటే నా మీద నాకే కోపం వచ్చినట్టు!'

మళ్ళీ ప్రేమతో ముడివేస్తూ, నా మనసు తీవ్రంగా కొట్టుకుంది.

అయినా నేను 'సారీ' చెప్పలేదు. నాలో అహం నా గొంతు నొక్కేసింది.

'నీకు తిక్క కదూ?' నేను మౌనంగా ఉండటంతో మళ్ళీ తనే అంది. నేను గట్టిగా నవ్వాను. ఎంతటి భారమైన వాతావరణాన్నయినా గాలంత తేలిగ్గా మార్చేసే శక్తి కేవలం తన మాటలకే ఉంది!

మేం విడిపోయి ఏడాది అయింది. ఓ రాత్రి రెండు గంటలైంది అనుకుంటా ఫోన్ చేసి వెక్కివెక్కి ఏడ్చింది. 'ఏమైంది?' అన్నాను కంగారుగా.

'నువ్వు ఫోన్ చేసి ఎంత కాలమైంది? నువ్వు రానక్కర్లేదు. కనీసం ఫోన్ చెయ్యరాదూ?'

'ఛ! నేను మూర్ఖుణ్ని'

'నన్ను క్షమించు. నిన్ను బాధ పెట్టాలని కాదు. చాలా బిజీగా ఉన్నా. ఇక ముందెప్పుడూ అలా జరగనివ్వను. సరేనా!' నాలో అహం నిలువెల్లా దహించుకు పోయింది తను అనురాగాగ్నితో.

★ ★ ★

మేం విడిపోయి అప్పటికి ఐదేళ్ళవుతోంది. నేను ప్రాక్టికల్ మనిషిని. తన భాషలో మెటీరియలిస్ట్‌ని.

'ఏయ్, నీకు స్కాన్ తీస్తే గుండె లేదని చెప్తారు?' మళ్ళీ ఓసారి ఫోన్లో నిష్ఠూరం.

'అవును, అది నీ దగ్గరే ఉంది కదూ?' నా మాటలో నేర్పు. 'ఏం లేకపోయినా మాటలకేం కొదవలేదు'

'అంతా నీ దయ'

★ ★ ★

మేం విడిపోయి అప్పటికి పదేళ్ళవుతోంది. ఈ పదేళ్ళలోనూ చాలా మార్పులు జరిగిపోయాయి. ఆర్థికంగా, శారీరకంగా. మానసికంగా మాత్రం కాదు! ప్రతీ శుక్రవారం తను ఫోన్ చేస్తుంది. లౌకిక రాజ్యానికి అది పవిత్రమైన రోజంట! హిందువులకి వరలక్ష్మీ వారం, ముస్లింలకి పవిత్ర దినం, క్రిస్టియన్లకి పవిత్ర శుక్రవారం! ఇదీ తన విశ్లేషణ.

ప్రతి వారం ఫోన్ చేసి 'ఎలా ఉన్నావు?' తన పలకరింపు.

'బానే ఉన్నా' నా జవాబు.

'సరే, పెట్టేస్తున్నా'

'ఓ.కే.'

తను ఇంకా మాట్లాడితే బాగుండునని నా ఆత్రం. 'తనే మాట్లాడొచ్చుగా' అన్న ఆమె తాపత్ర1 ఇద్దరికీ తెలిసినా ఆకాశమంత నిస్సహాయత! పెల్లుబికే దుఃఖం!

ఓ వర్షాకాలపు సాయంకాలం అకస్మాత్తుగా ఫోన్ చేసింది. నిజానికి ఆ రోజు శుక్రవారం కాదు!

'ఏయ్, కారుకి ఎక్సిడెంట్ అయిందా?'

'లేదు'

'మరి, సర్వీసింగ్ సెంటర్‌లో ఉందేం?'

'జస్ట్ జనరల్ సర్వీసింగ్'

'అబద్ధం చెప్పకు. డెంట్ ఉంది, గ్లాస్ పగిలింది. నీకేం అయిందోనన్న కంగారుతో చేశా. ఏం కాలేదుగా'

'ఏం కాలేదు. నేను బానే ఉన్నా. చిన్న ఎక్సిడెంట్ అంతే'

తన ప్రేమ పాశం నుండి తప్పించుకోవడం ఈ జన్మకి సాధ్యంకాదు.

ఇంకో వేసవికాలపు సాయంత్రం హడావిడిగా ఫోన్ చేసింది. 'ఏయ్, ఎలా ఉన్నావ్?' 'బానే ఉన్నా' అన్నాను లేని శక్తి తెచ్చుకుంటూ. 'నిన్న రాత్రి నీకు ఒంట్లో బాలే



ఇంత మంది జనంలో ఎలా ఆమెని పట్టుకోవాలి? పాదాలు పసుపుగా మారే పారిజాతపు చెట్టు కింద ఎదురు చూస్తానంది. చెట్టయితే కనిపిస్తోంది కానీ కానీ తనెక్కడ? చుట్టూ వెదికాను. అంతలో నా చేతి మీద చల్లగా తగిలింది. గోదాట్లో మునిగి లేచినంత హాయిగా ఉంది. పాదాల కింద తడి ఇసుక గిలిగింతలు పెడుతోన్నట్టుంది. తేట నీటిపై చిరుచేపలు తుళ్ళుతోన్నట్టుంది. అది తన కరస్పర్శ!

దని కల వచ్చింది. అప్పటి నుండి నిద్ర పట్టలేదు. ఏడుస్తూనే ఉన్నా. ఈ రోజు ఉదయాన్నే గుడికి వెళ్ళి నీ పేర్న అభిషేకం చేయించాను. ఇదిగో విను, నీకేమైనా అయితే నేనీ భూమ్మీద ఉండను. ఎందుకంటే అయ్ లవ్ యు టిల్ మై లాస్ట్ బ్రెత్...' దుఃఖంలో తన గొంతు పూడుకు పోతుంటే ఫోన్ పెట్టేసింది. తన ప్రేమతో నా హృదయం తడుస్తోంది. అంతవరకు పోయినట్టున్న ప్రాణం తిరిగి పుంజుకున్నట్టనిపించింది.

'మీరు కారు ఇక్కడే పార్క్ చెయ్యాలి' ఒక వ్యక్తి వచ్చి చెప్పడంతో ఇహలోకంలో పడ్డాను. 'మరి ఇక్కడ నుండి ఎలా వెళ్ళాలి?'

'నడుచుకుని'

'ఓ గాడ్! ఘాట్‌కి ఎంత దూరం ఉంటుంది?'

'సుమారు ఆరు కిలోమీటర్లు' గుంపులో ఎవరో చెప్పారు.

'ఛ... భూమ్మీద ఇంకెక్కడా స్థలం లేనట్టు ఇక్కడికి రమ్మంది?' విసుక్కుంటూ నడుస్తున్నాను.

'ఇలా నడిచి వెళితేనే పుణ్యం వస్తుంది నాయనా' ఓ ముసలాయన హితబోధ!

పుణ్యం నాకక్కర్లేదు. అయినా నేను పక్కా నాస్తికుడిని. మనసులోనే గొణుక్కున్నాను. తను పుణ్యం చేసి మాత్రం ఏం పొందిందని, ఒంటరితనం తప్ప!

ఆకాశం కొమ్మలు దులిపినట్టు పూలరేకుల్లా జనం! పుడమిపై మనుషుల తివాచీ కప్పినట్టుంది. నడుస్తుంటే ఒకరికొకరు తగులుతున్నారు. గోదారంటే తనకిష్టం! తనంటే నాకిష్టం! ఆమె స్మృతుల్లో నడుస్తుండటంవల్ల అలసట లేదు! విసుగూ లేదు.

ఇంత మంది జనంలో ఎలా ఆమెని పట్టుకోవాలి? పాదాలు పసుపుగా మారే పారిజాతపు చెట్టు కింద ఎదురు చూస్తానంది. చెట్టయితే కనిపిస్తోంది కానీ కానీ తనెక్కడ? చుట్టూ వెదికాను. అంతలో నా చేతి మీద చల్లగా తగిలింది. గోదాట్లో మునిగి లేచినంత హాయిగా ఉంది. పాదాల కింద తడి ఇసుక గిలిగింతలు పెడుతోన్నట్టుంది. తేట నీటిపై చిరుచేపలు తుళ్ళుతోన్నట్టుంది. అది తన కరస్పర్శ!

తన కళ్లల్లో ఒకలాంటి తృప్తిని నింపుకున్న కన్నీరు. అప్రమేయంగా నా కళ్ళూ అనుకరించాయి. మాట సెలవేసింది. హృదయపు లోలోతుల్లో పొర్లుతోన్న జలలా అలజడి! తను నా చేతిని పట్టుకుని ఒడ్డుకు నడిచింది. అంతలో ఓ పురోహితుడు మమ్మల్ని సమీపించాడు. అతడి చేతిలో సామాగ్రి. నన్ను కూర్చోమని చేత్తో సైగ చేశాడు. జరుగుతోందేంటో నాకర్థం కాలేదు. తనని అడుగుదామంటే తన్మయంగా గోదారిని చూస్తోంది. అతదేవో మంత్రాలు చదివాడు. నాకంతా అయోమయంగా ఉంది.

అతడు సంకల్పం చదువుతూ 'తమరి కళత్ర నామధేయం?' అడిగాడు.

అంతా గందరగోళంగా ఉంది.

'అదే, మీ భార్య పేరు చెప్పండి?' అన్నాడతను నా మొహాన్ని చూసి.

'అర్పిత' తను చెప్పింది.

నేను ఉలిక్కిపడ్డాను.

'వ్వాట్! అర్పితా, ఏంటిదంతా! అసలీ కార్యక్రమం ఏంటి?' అసహనంగా అరిచాను.

అప్పటికే తంతు ముగిసింది.

'ప్లీజ్ కూల్‌డౌన్' అంది నా దగ్గరికి వచ్చి.

'అర్పితా, ఎందుకిలా నా చేత చేయించావు?'

'అయినా నీకు, నేను పిండం వేయడం ఏమిటి?' అన్నాను తనని గట్టిగా ఊపేస్తూ.

'టెన్షన్ పడకు. నే చెప్పేది విను. రేపు నాకు ఆపరేషన్. జీవించే అవకాశాలు చాలా తక్కువని డాక్టర్లు చెప్పారు. అయినా ఆఖరి ప్రయత్నం చేస్తున్నారు. ఇది నా ఆఖరి కోరిక. నీ భార్యగా మరణిస్తున్నాను. ఈ జన్మకిది చాలు. మళ్ళీ శుక్రవారం వరకు నేను బతికే ఉంటే, ఎప్పట్లానే ఫోన్ చేస్తాను. లేదా... నన్ను క్షమించు'

నేను స్థాణువయ్యాను. గొంతు మూగబోయింది. నా పిడికిళ్లు బిగుసుకుపోయాయి. ఏదో అసహనం. అశక్తత. ఆరిపోబోతోన్న నా ప్రాణాన్ని ఎలా వెనక్కి తెచ్చుకోను? తనని గట్టిగా పొదివి పట్టుకున్నాను. మా మధ్య అలుముకోవటాన్కి గాలికి సయితం అనుమతి నివ్వనంత గాఢంగా అల్లుకున్నాను. ఉన్మాదిలా నిస్సహాయంగా ప్రాణాలుగ్గబట్టుకుని హత్తుకున్నాను. అసలు నా నుండి తనని వేరు చేసే శక్తి ఎవరికుంది? అసలింత పగ ఎవరికుంది? గుండె గోదారయ్యింది. గోదారికి వరద వచ్చిందన్న ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది! ★